క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చెట్లను తొలగించనున్న నేపథ్యంలో గద్వాల రూరల్ పరిధిలోని 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రం వీరాపురం నుంచి వెళ్లే 11కేవీ ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ రూరల్ ఏఈ శ్రీనివాసులు తెలియజేశారు. ఉదయం 6 గంటల నుంచి 8:30 గంటల వరకు గద్వాల మండలంలోని అనంతపురం, వీరాపురం, ఇండస్ట్రియల్ ఏరియా పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికల కేంద్రాన్ని తహసీల్దార్ వహీదా కాతూన్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎన్నికల కేంద్రంలో అన్ని మౌలిక వసతులు, సదుపాయాలు కల్పించాలని, ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ రజనీకాంత్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న జొన్నల కొనుగోలు



రాజోళి: మండలంలో జొన్న రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుంది. వ్యవసాయ సహకార సంఘం, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ జొన్నల కొనుగోలులో భాగంగా మండల కేంద్రం రాజోళి, పచ్చర్లలో కేంద్రాలు ఏర్పాటు చేశారు. కాగా.. ప్రస్తుతం రాజోళిలోని కేంద్రంలో కొనుగోలు జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం కొనుగోలు సమయం ముగిసే సరికి 24 మంది రైతుల నుంచి 1,124 బస్తాల జొన్నలను కొనుగోలు చేసి, రెండు లారీల్లో ప్రభుత్వ గోదాంకు తరలించినట్లు పీఏసీఎస్ అధికారులు తెలిపారు. కొనుగోలు ప్రక్రియ ఇంకా కొనసాగుతుందని, రైతులు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్షయపై అవగాహన



ఉండవెల్లి: మండలంలోని తక్కశీలలో ఆరోగ్య ఉపకేంద్రంలో క్షయ నిర్మూలనపై వైద్యులు ప్రత్యేక అవగాహన కల్పించారు. శుక్రవారం క్షయతో బాధపడుతున్న వారి కంటి నమోదు పరీక్షలు నిర్వహించారు. అనంతరం క్షయ సూపర్‌వైజర్లు గురుబసవయ్య, శ్రీనివాసులు రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఏఎంపీ బాలీశ్వరయ్య శెట్టి, ఏఎన్ఎం నర్సమ్మ ఆశాలు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ

కేటీదొడ్డి: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు వాహనాలు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. శుక్రవారం మండలంలోని రాష్ట్ర సరిహద్దు నందిన్నె చెక్‌పోస్టును ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ పోలీసుల ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్రం నుంచి తెలంగాణలోకి మద్యం, డబ్బులు రాకుండా అధికారులు గట్టి బందోబస్తుతో పాటు తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'బెదిరింపులకు గురిచేస్తున్న కాంగ్రెస్ నాయకులు'

ఉండవెల్లి: కాంగ్రెస్ నాయకులు బెదిరింపులకు గురిచేస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు పిడుగు వెంకటేష్ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ కార్యకర్తలకే అన్ని వర్తింపజేస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అనడం సరికాదని అన్నారు. ఇక్కడ ఓడిపోయినా.. అన్ని మా నుంచే నిధులు, నియామకాలు జరుగుతాయని అనడం ఏమిటని ప్రశ్నించారు. ఆస్పత్రిని, ఆరు గ్యారంటీలను అమలు చేయని ప్రభుత్వం.. బీజేపీని విమర్శించడం ఏమిటని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉపేందర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, నారాయణ గౌడ్, శివ కృష్ణ, మనోహర్, సూర్య పాల్గొన్నారు.



స్వచ్ఛత.. తేల్చేలా!

- చేతిపంపులు, బావులు, భగీరథ నీటికి పరీక్షలు
- పంచాయతీలకు క్లోరోస్కోప్ కిట్లు పంపిణీ
- కార్యదర్శులకు ఇప్పటికే అవగాహన
- స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు చర్యలు



మారమునగాల-1లో ట్యాంకులో నీటిని పర్యవేక్షిస్తున్న మిషన్ భగీరథ ఏఈ



నీటి బోరులను పర్యవేక్షిస్తున్న అధికారులు

ఉండవెల్లి: ఎండలు మండిపోతున్నాయి. దీంతో నిత్యం వాడే మంచినీటికి ప్రాధాన్యత ఏర్పడింది. అలంపూర్ నియోజకవర్గంలో ఏడు మండలాల్లో అన్ని గ్రామాలకు భగీరథ నీరు సరఫరా అవుతోంది. కొన్నిచోట్ల బోరుబావుల నుంచి లేదా ప్రత్యామ్నాయంగా నీటిని సరఫరా చేస్తున్నారు. కొన్ని సందర్భాలలో పైపులైన్ల లీకేజీ, ట్యాంకుల అపరిశుభ్రతతో అక్కడక్కడ నీరు కలుషితం అవుతుందనే వాదన వినిపిస్తోంది. దీంతో నీరు కలుషితం కాకుండా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేసేందుకు గ్రామీణ నీటి సరఫరా విభాగం వారు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. గ్రామాల్లోనే తాగునీటిని పరీక్షించేందుకు నియోజకవర్గంలోని అన్ని పంచాయతీలకు క్లోరోస్కోప్ కిట్లను అందజేశారు. చేతిపంపులు, మంచినీటి బావులు, ఇతర పథకాల నీటిని పరీక్షించేందుకు అందించిన క్లోరోస్కోప్ కిట్ల వినియోగంపై పంచాయతీ కార్యదర్శులకు ఇప్పటికే అవగాహన కల్పించారు. పరీక్ష కిట్ల ద్వారా ప్రజలు నిత్యం వినియోగిస్తున్న నీటిలో ప్రమాణాలు ఏయే మేరా ఉన్నాయో వెంట వెంటనే తెలిసిపోతుందని గ్రామీణ నీటిసరఫరా అధికారులు పేర్కొంటున్నారు.

నీటి ట్యాంకులు, నల్లా కనెక్షన్ల వివరాలు..

భగీరథ నీటి ట్యాంకులు	నల్లా కనెక్షన్లు
306	60,000 పైగా
చేతి పంపులు 800	

తేడాలుంటే ప్రత్యామ్నాయం..

వాటర్ ట్యాంకులు, చేతిపంపులు, మంచినీటి బావుల నీటి నాణ్యత పరీక్షలపై పారదర్శకంగా వ్యవహరిస్తున్నారు. ప్రతి తాగునీటి వనరు వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. పరీక్ష నివేదిక ఆధారంగా నీరు తాగేందుకు పనికొస్తుందా..లేదా? అనే వివరాలు నమోదు చేయాల్సి వస్తుంది. నాణ్యతలో తేడా వస్తే అక్కడ సమీపంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో తాగునీటిని అందించనున్నారు.

వినియోగిస్తేనే సార్థకత..

అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి జీపీకో నీటి నాణ్యత పరీక్ష కిట్లు సరఫరా చేసింది. వాటి నిర్వాహణపై పంచాయతీ సిబ్బందికి నైపుణ్యం లేకపోవడంతో, వాటిని సక్రమంగా వినియోగించకపోవడంతో వాటిలోని రసాయనాలు, కరిగి పనికి రాకుండా పోయాయి. అంతే కాకుండా అప్పట్లో పంచాయతీ కార్యదర్శుల కొరత కూడా ఉండేది. ఇప్పుడు పంచాయతీకో కార్యదర్శి ఉండడంతో నీటి పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించే అవకాశాలున్నాయి. కిట్లలోని రసాయనాలు అయిపోతే, పంచాయతీల నుంచి కొనుగోలు చేసుకునే అవకాశం ఉంది. ఇలాంటి సమయంలో నీటి నాణ్యత ప్రమాణాల పరీక్షల కిట్లను వినియోగిస్తేనే సార్థకత ఉంటుంది. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు అవుతుందని పలువురు పేర్కొంటున్నారు.

అన్ని పంచాయతీలకు కిట్లు అందించాం..

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు నియోజకవర్గంలో అన్ని పంచాయతీలకు నీటి పరీక్ష కిట్లను అందించాం. వాటి నిర్వాహణపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాం. పరీక్షలు జరిపే తీరుపై పర్యవేక్షణ చేస్తున్నాం. కిట్ల ద్వారా నీటిని పరీక్షిస్తే లోపాలు వెంటనే తెలిసిపోతుంది. నీటి సరఫరాకు ఆటంకం కలిగితే ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం.

– వెంకట్రాములు, డీఈ, మిషన్ భగీరథ

బాలికలను వేధిస్తే చర్యలు



కొర్విపాడులో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ చంద్రకాంత్



ధర్మవరంలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ స్వాతి

మానవపాడు: జాతీయ రహదారి అప్రోచ్‌గా ఉన్న గ్రామాల్లో స్పీడ్ బ్రేకర్స్, లైటింగ్, సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కొర్విపాడులో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్పీ రితిరాజ్ ఆదేశాల ప్రకారం డయల్ 100, రోడ్డు సేఫ్టీ, సైబర్ క్రైమ్, మాదకద్రవ్యాల వినియోగంతో జరిగే నష్టాలు ఫోక్సో కేసుల పర్యవసానాలు, సీసీ కెమెరాల ఉపయోగాలపై అవగాహన కల్పించామన్నారు. గ్రామాల్లో బాలికలను లైంగికంగా వేధిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. బాలికలను వేధిస్తే ఫోక్సో కేసులను నమోదు చేస్తామన్నారు. ఏవైనా తక్కువ ధరలకు వస్తాయంటే నమ్మి మోసపోవద్దని, బ్యాంకుల నుంచి ఎలక్ట్రిక్ డిపార్ట్‌మెంట్ నుంచి ఫోన్ చేస్తే మొబైల్ ఓటీపీ అడిగితే చెప్పవద్దన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అంశాలు, చట్టాలపై..


ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల పరిధిలోని ధర్మవరంలో ఎస్పీ ఆదేశాల మేరకు కోదండాపురం పీఎస్ ఆధ్వర్యంలో ఎస్సై స్వాతి శుక్రవారం సామాజిక అంశాలతో పాటు పోలీస్ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆపదలో ఉపయోగపడే డయల్-100, రోడ్డు సేఫ్టీ, సైబర్ క్రైం, మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలు, పోక్సో కేసుల పర్యవసానాలు, సీసీ కెమెరాల ఉపయోగాలతో పాటు రైతులకు వివిధ ఆర్థిక అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

అయిజ: ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ విజయ భాస్కర్ అన్నారు. గురువారం రాత్రి మండలంలోని పులికల్‌లో ఎస్ఐ గ్రామ ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా రోడ్డు భద్రత, సైబర్ క్రైమ్స్, మాదకద్రవ్యాలతో కలిగే నష్టాలు, పోక్సో కేసుల పర్యవసనాలు, సీసీ కెమెరాల ఉపయోగాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో డయల్ 100కు ఫోన్ చేసి పోలీసుల సాయం పొందాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేయొద్దు

ధరూరు: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, 18 ఏళ్లు నిండాకే బాలికలకు పెళ్లి చేయాలని పోలీసులు సూచించారు. ఎస్పీ ఆదేశానుసారం శుక్రవారం సాయంత్రం మండల పరిధిలోని రేవులపల్లిలో పోలీసు కళాజాతా బృందంతో సామాజిక సమస్యలపై అవగాహన కల్పించారు. పిల్లలకు విధిగా ఈత నేర్పించాల్సి వస్తే తప్పనిసరిగా తక్కువ నీరు ఉన్న ప్రాంతాలు, తల్లిదండ్రులు వెంట వెళ్లి నేర్పించాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలు, 100 కాల్, సైబర్ క్రైం, రోడ్డు భద్రత నియమాలు, ఫ్రెండ్లీ పోలీస్ తదితర అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లను విడుదల చేశారు.



అయిజలో మాట్లాడుతున్న ఎస్ఐ విజయ భాస్కర్



రేవులపల్లిలో పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్ఐ విజయ్‌కుమార్

మామపై అల్లుడి దాడి

ధరూరు: తన భార్యను ఎవరిని అడిగి పుట్టింటికి తీసుకెళ్లావ్ అంటూ మామపై దాడి చేసిన సంఘటన మండల పరిధిలోని నీలహళ్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నీలహళ్లికి చెందిన మునెప్ప కుమార్తె అనితను ధరూరుకి చెందిన వీరేష్‌కు ఇచ్చి వివాహం చేశాడు. పుట్టినింటిలో వడి బియ్యం కార్యక్రమం ఉందని, దుస్తులు పెడతామని చెప్పి, తన తండ్రి కుమార్తెను ఇంటికి తీసుకెళ్లాడు. శుక్రవారం మధ్యాహ్నం అనిత భర్త వీరేష్ నీలహళ్లికి చేరుకుని ముందుగా.. ఎవరిని అడిగి ఇక్కడికి వచ్చావంటూ.. భార్యపై దాడి చేశాడు. ఆ తరువాత అడ్డొచ్చిన మామపై దాడి చేశాడు. మునెప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలియజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉండవెల్లి: మండలంలోని చిన్న ఆముదాలపాడుకి చెందిన శ్రీను(51) ఈ నెల 20న కట్టింగ్ చేయించుకోవడానికి ఉండవెల్లికి వెళ్లి తిరిగి బైక్‌పై ఇంటికి పయనమయ్యాడు. గ్రామం చివరన ద్విచక్రవాహనం చెట్టును ఢీకొట్టగా తీవ్ర గాయాలపాలయ్యాడు. గాయాలైన వ్యక్తిని గ్రామస్తులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి ఆటోలో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతిచెందాడు. భార్య అద్దాకుల రంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలియజేశారు.

దాడి ఘటనపై కేసు నమోదు

ఎర్రవల్లిచౌరస్తా: అకారణంగా దాడి చేసిన సంఘటనలో వ్యక్తిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు కోదండాపురం ఎస్ఐ స్వాతి తెలిపారు. పీఎస్ పరిధిలోని పల్లెపాడుకు చెందిన వడ్డేగాస్ గురువారం అర్ధరాత్రి భార్యపై దాడి చేస్తుండగా.. అడ్డుపోయిన కుటుంబ సభ్యులపై కర్రతో దాడి చేసినట్లు తెలిపారు. ప్రమాదంలో ముగ్గురికి రక్త గాయాలు కావడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కేటీదొడ్డి: ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఎస్ఐ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాపదిన్నెకి చెందిన నర్సప్ప అనుమతులు లేకుండా యాపదిన్నె నుంచి ఇర్కిచెడ్‌కు ఇసుకను తరలిస్తున్నాడని పోలీసులకు సమాచాం అందింది. పోలీసులు ఇర్కిచేడు శివారులో ఉదయం అక్రమ ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి యజమాని నర్సప్పపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.



పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మల్లెందొడ్డిలో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ కమలాదేవి

మల్దకల్: పౌష్టికాహారం తీసుకోవడంతోనే గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ కమలాదేవి సూచించారు. గ్రాడ్యుయేషన్ డే పురస్కరించుకుని శుక్రవారం మల్దకల్, మల్లెందొడ్డి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. గర్భిణులు పోషకాలు ఎక్కువగా ఉండే పాలు, గుడ్లు, ఆకుకూరలను తీసుకోవడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు చేయించుకోవాలన్నారు. ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు అంగన్‌వాడీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎత్తు, బరువు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి, టీచర్లు లక్ష్మిరంగమ్మ, సురేఖ, మహేశ్వరమ్మ, పుష్పమ్మ, శ్రావణి, అనిత, పద్మజ, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి ధరూరు ఉర్సు



ధరూరులోని దర్వేశ్ ఖాద్రీ దర్గా

ధరూరు: దర్వేశ్ ఖాద్రీ సాహెబ్ ఉర్సు ఉత్సవాలు ఈ నెల 29 నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతిఏటా ధరూరులో కొనసాగే ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. ఈ ఉర్సు ఉత్సవాలకు జిల్లా నలుమూలలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల భక్తులు అధికంఖ్యలో హాజరై దర్గాలో తమ మొక్కులు సమర్పించుకుంటారు. హిందూ, ముస్లింలు కలిసి జరుపుకొనే ఈ ఉత్సవాలు ఆద్యంతం భక్తిశ్రద్ధలతో కొనసాగుతాయి.

కార్యక్రమాల వివరాలు ఇలా..

ఈ నెల 29న రాత్రి 10 గంటలకు గంధం కార్యక్రమంతో ఉర్సు ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 30న ఉర్సు, 31న సద్ది ఉర్సు ఉత్సవాలు కొనసాగుతాయి.

బీజేపీని గెలిపించి అభివృద్ధికి తోడ్పడండి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

అయిజ: బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి దేశ అభివృద్ధికి తోడ్పడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. బీజేపీ దేశంలోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తుందన్నారు. 370 జీఓ ఎత్తివేసి దేశంలో కాశ్మీర్‌ని ఒక భాగంగా చేసిందని అన్నారు. జీఎస్టీని పార్లమెంట్ బిల్లులో పెట్టి దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిందని, 33 శాతం మహిళ రిజర్వేషన్‌కు పునాది వేస్తుందని, ఏబీసీడీ వర్గీకరణ సమస్యకు పరిష్కారం చూయించడానికి బీజేపీ సిద్ధమైందని తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, అసెంబ్లీ కన్వీనర్ తిరుమల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ, పట్టణ అధ్యక్షుడు నరసింహయ్య శెట్టి, పట్టణ ప్రధాన కార్యదర్శి భగత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో పిల్లలపై జాగ్రత్త వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జ్యోషి శ్రీనివాసశర్మ

శాంతినగర్: వేసవి కాలంలో ఎండలు తీవ్రమవుతున్నందున పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని వడ్డేపల్లి తహసీల్దార్ జోషి శ్రీనివాసశర్మ తల్లిదండ్రులకు సూచించారు. వడ్డేపల్లి మండల స్థాయి పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశం శుక్రవారం మండల మహిళా సమాఖ్య భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. పదోతరగతి పూర్తిచేసిన పిల్లలందరిని పనులకు పంపకుండా పైతరగతులు చదివించాలని సూచించారు. ఎంపీడీఓ రమేష్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎవరూ కూడా బాల్యవివాహాలు చేయకూడదన్నారు. విద్య అన్నిరకాల ఆటంకాలను నిరోధిస్తుందని, చదువుకున్న వారు ఎలాగైనా సమాజంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ హనిమిరెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలల యాజమాన్య కమిటీ పదవి కాలం ఈ వేసవితో ముగుస్తుందని, ఇప్పటి నుంచి బాలల హక్కుల పరిరక్షణ వేదిక ద్వారా పిల్లల హక్కులను కాపాడటంలో భాగస్వాములు కావాలని, పిల్లల సమస్యలపై పోరాడాలని కోరారు.

29న రాంపాటి శివాలయంలో వేడుకలు



ముండ్లదిన్నెలో పూజలు చేస్తున్న భక్తులు



తుంగభద్ర నది మధ్యలో వెలిసిన రాంపాటి శివాలయం

రాజోళి: సుబ్రహ్మణ్య స్వామి షష్టి ఈ నెల 29న నిర్వహించనున్న సందర్భంగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు అర్చకుడు అడివిస్వామి తెలిపారు. మండల కేంద్రం రాజోళిలోని తుంగభద్ర నది మధ్యలోని రాంపాటి శివాలయంలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. సుబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలతో పాటుగా రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేయనున్నట్లు చెప్పారు. దాతల సహకారంతో వేలాది మందికి అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఇప్పటికే కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ముండ్లదిన్నెలో లింగమయ్య ప్రతిష్ఠాపన

మండలంలోని ముండ్లదిన్నెలో లింగమయ్య ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలో శుభం చేకూరే లక్ష్యంతో ప్రతిష్ఠించిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, గ్రామపెద్దలు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు దక్షిణామూర్తి, పవన్ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేసి లింగమయ్యను ప్రతిష్ఠించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని సరస్వతీ ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సరస్వతి దేవికి అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు ఉదయాన్నే బీచుపల్లికి చేరుకొని సరస్వతీదేవిని దర్శించుకున్నారు. అదేవిధంగా ఎర్రవల్లి చౌరస్తాలోని శివాంజనేయస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు నర్సింహస్వామి ఆధ్వర్యంలో కుంకుమార్చన, పూజలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

మెగా డీఎస్సీ నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్

గద్వాల అర్బన్: జిల్లాకు 300 పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన జిల్లాస్థాయి విస్తృతస్థాయి ముగింపు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండా విద్యలో ప్రమాణాలు పెంచడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. జిల్లాలో ఎర్రవల్లి, కేటీదొడ్డి, రాజోళి మండలాల్లో జూనియర్ కళాశాలలు, అయిజ మండలంలో నూతన డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని, మన ఊరు-మన బడి కార్యక్రమంలో అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేయాలని, గురుకుల వసతిగృహాలు, కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు సంఘటితంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశానికి ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు ఉప్పేరు నర్సింహ, కన్వీనర్ అంజి, కో కన్వీనర్ శివకుమార్, కమిటీ సభ్యులు సూర్య కుమార్, పరశురాం, కార్తీక్, కిరణ్ పాల్గొన్నారు.

సద్దలోనిపల్లి కృష్ణస్వామి ఆలయంలో చోరీ

మల్దకల్: మండలంలోని సద్దలోనిపల్లి కృష్ణస్వామి ఆలయంలో గురువారం గుర్తుతెలియని వ్యక్తులు హుండీ పగలగొట్టి చోరీ చేసినట్లు ఆలయ చైర్మన్ రామకృష్ణ, సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు ఎస్ఐ సురేష్‌గౌడ్ శుక్రవారం సద్దలోనిపల్లి కృష్ణస్వామి ఆలయంలోని హుండీని పరిశీలించారు. ఆలయ హుండీ పగలగొట్టి రూ.2 లక్షలకు పైగా అపహరించుకుపోయినట్లు వారు ఎస్ఐకు తెలిపారు. ఇదిలా ఉండగా కృష్ణస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు చోరీ చేసిన సమయంలో పనిచేయకపోవడంతో దొంగలను గుర్తించడం కొంత ఇబ్బంది ఏర్పడింది. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

మొక్కల సంరక్షణపై దృష్టి

అమరచింత: హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని మస్తీపురంలో చెట్టు చెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొక్కలకు నీటిని అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రధాన రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలు అగ్నికి ఆహుతి కాకుండా వాటి పాదుల వద్ద చెత్తచెదారం తొలగించాలని సూచించారు. మొక్కలకు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని అందిచాలని ఆదేశించారు. ప్రార్థన మందిరాలు, ఆలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల ఆవరణంలో నాటిక మొక్కలను కాపాడాల్సిన అవసరం ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు.